AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN


11-4-2026 (Saturday) MAIN EDITION

## అధికారంలోకి వచ్చాక బుద్ధి చెబుతాం..



**అక్షరటుడే, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 28 నెలల్లో రేవంత్ సాధించింది ఏమీ లేదన్నారు. ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడం తప్ప ఏం చేశారని ఎద్దేవా చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీతో పాటు.. సెగ్మెంట్‌లోని గ్రామాల్లో ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లు, సర్పంచ్‌లను కేటీఆర్ శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్న అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. తాము అధికారంలోకి వచ్చాక వారికి బుద్ధి చెబుతామన్నారు. ఇబ్రహీంపట్నంలో గెలిచింది గులాబీ జెండా కాదు, ప్రజాస్వామ్యం అని కేటీఆర్ అన్నారు.

## ఇరాన్ కండీషన్లకు ఒప్పుకున్న అమెరికా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలిక విరామం లభించిన విషయం తెలిసిందే. ఇరాన్-అమెరికా కాల్పుల విరమణకు అంగీకరించాయి. రెండు వారాల పాటు సీజ్ ఫైర్ అమలులో ఉంది. ఈ నేపథ్యంలో శాశ్వత పరిష్కారం కోసం రెండు దేశాలు పాకిస్థాన్‌లో భేటీ కానున్నాయి. పాక్‌లోని ఇస్లామాబాద్‌లో ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరగనున్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం ఇప్పటికే పాక్ చేరుకుంది. ఈ టీమ్‌లో ట్రంప్ సన్నిహితుడు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ కూడా ఉన్నారు. చర్చలకు ముందు ఇరాన్ రెండు నిబంధనలు పెట్టింది.

## 25,487 కానిస్టేబుల్ ఉద్యోగాలు..


**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ కానిస్టేబుల్ (జీడీ) ఉద్యోగాల పరీక్షల తేదీలను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 27 నుంచి మే చివరి వరకు దేశంలోని వివిధ సెంటర్లలో ఎగ్జామ్స్ జరుగుతాయని పేర్కొంది. కాగా ఫిబ్రవరి 23నే పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉండగా వాయిదా పడ్డాయి.

## సింగర్ మంగ్లీపై కేసు నమోదు




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** సింగర్ మంగ్లీ మరో వివాదంలో చిక్కుకుంది. రూ. 10 కోట్ల మోసం చేయడంతో పాటు, ప్రాణహాని తలపెట్టారని ఓ వ్యక్తి ఇచ్చి ఫిర్యాదుతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్ల కింద ఆమెతో పాటు సోదరుడిపై కేసు బుక్ అయ్యింది.

## ఏటీఎం అపహరణ



**అక్షరటుడే, రాజన్న సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఎల్లారెడ్డిపేటలో ఏటీఎం చోరీకి పాల్పడ్డారు. ఏకంగా ఎస్‌బీఐ ఏటీఎం మెషిన్‌ను ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేటలోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి తెల్లవారుజామున దొంగలు చొరబడ్డారు. ఏకంగా మిషన్‌ను వాహనంలో ఎక్కించుకుని పారిపోయారు.

## లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు..



**అక్షరటుడే, సూర్యాపేట:** ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొంది. సూర్యాపేట జిల్లాలోని కోదాడ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి ఏలూరుకు 36 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందు వెళ్తున్న ఒక లారీని ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు సమాచారం.

## కార్డన్ సెర్చ్‌లో సిలిండర్లు స్వాధీనం

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** నగరంలోని మంగళహాట్‌లో పోలీసులు శనివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు జుంగూరు బస్తి, దూల్‌పేటలలో తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 111 గ్యాస్ సిలిండర్లు, 50 లీటర్ల మద్యం, పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా ఆపరేషన్..

**సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను కూల్చివేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ భారీ ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా.. నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్‌తో పాటు, ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చివేస్తోంది.**

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



- **హైకోర్టు న్యాయవాది ఫాం హౌస్ కూల్చివేత**
- **ఆరంతస్తుల భవనం సైతం..**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ భూముల్లోని కట్టడాలను తొలగించింది. వేలాది మంది అధికారులు, పోలీసుల బందోబస్తు మధ్య న్యాయవాది ముఖీమ్ ఫామ్ హౌజ్, అతడి సోదరుడు అజీమ్ నిర్మించిన ఆరంతస్తుల బిల్డింగ్‌ను నేలమట్టం చేసింది. ఈ 863 ఎకరాల భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

### వేలాది ప్లాట్ల విక్రయం..!

ప్రభుత్వ భూముల్లో ముఖీమ్ (తన భూ మాఫియా ముఠా ద్వారా) వేలాది ప్లాట్లను ఆక్రమించి, విక్రయించి రూ. వందల కోట్లు సంపాదించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఐలాపూర్ భూములపై 1998లో హైకోర్టు స్టే విధించింది. అయినా కూడా ముఖీమ్, అతని భూ మాఫియా మొదట ఫామ్ హౌజ్ నిర్మించినట్లు తెలుస్తోంది. అనంతరం సమీప స్థలాలను ఆక్రమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖీమ్ ఇప్పటివరకు నోటరీల వద్ద వేలాది ప్లాట్లను విక్రయించి వందల కోట్ల రూపాయలు సంపాదించినట్లు సమాచారం. అతని ముఠా అక్రమంగా ఏర్పాటు చేసిన వాణిజ్య దుకాణాల నుంచి ప్రతి నెలా కోట్ల రూపాయలు వసూలు చేస్తుందని ఆరోపణలు ఉన్నాయి.

### కూల్చివేతలపై స్టే ఇవ్వలేదు

ఐలాపూర్‌లో కూల్చివేతలపై హైకోర్టు స్టే ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీంతో హైడ్రా కూల్చివేతలు నిలిపివేసిందని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఖండించారు. హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదన్నారు. ముఖీమ్ తన ఫామ్‌హౌజ్ కేంద్రంగా ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. 20 ఏళ్లుగా ముఖీమ్ తన అనుచరులతో కలిసి భూదందా చేస్తున్నట్లు తెలిపారు. 100 గజాలకు రూ.10 లక్షల చొప్పున పేదలకు విక్రయించాడన్నారు.

### స్థానికుల హర్షం

ఐలాపూర్‌లో కూల్చివేతలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు కాపాడిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఫొటోకు పాలాభిషేకం చేశారు. కాగా గ్రామంలో మొత్తం 1,263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. అందులో ఇప్పటికే కొందరు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు వాటి జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమినే కాపాడారు.



## పార్లమెంట్ ఆవరణలో అరుదైన సన్నివేశం.. మోదీ – రాహుల్ గాంధీ మాటామంతి


**అక్షరటుడే, ఢిల్లీ:** పార్లమెంట్ ఆవరణలోని ప్రేరణా స్థల్ అరుదైన రాజకీయ సన్నివేశానికి వేదికైంది. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వచ్చిన ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒకరినొకరు పలకరించుకున్నారు. అంతే కాకుండా కాసేపు ముచ్చటించడం అందరినీ ఆకర్షించింది. జ్యోతిబా పూలే 200వ జయంతి సందర్భంగా పార్లమెంట్ ప్రాంగణంలో శనివారం జరిగిన నివాళి కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంభాషించుకోవడం కనిపించింది. సంఘ సంస్కర్తకు పుష్పాంజలి ఘటించడానికి ప్రేరణా స్థల్ వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఇతర సీనియర్ నాయకులతో సహా అగ్రశ్రేణి రాజ్యాంగ నాయకులు హాజరైన ఒక బహిరంగ కార్యక్రమంలో ఈ సంభాషణ జరిగింది.

## బీసీల కోసం జాగృతి పోరాటం : కవిత





**అక్షరటుడే, హైదరాబాద్:** బీసీల కోసం తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పూలే మళ్లీ పుట్టాడా అనే స్థాయిలో బీసీల కోసం పని చేస్తామన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కవిత నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళ రిజర్వేషన్ల బిల్లులో బీసీ ఉపకోటా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరగనుందన్నారు. అవసరమైతే ఢిల్లీకి వెళ్లి అన్ని పార్టీల వారితో ఈ అంశంపై మాట్లాడతానని తెలిపారు.

## హార్ముజ్‌లో సీమైన్స్ ఎక్కడున్నాయో తెలియదన్న ఇరాన్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే. సరుకు రవాణా నౌకలను అడ్డుకోవడానికి సముద్రంలో సీమైన్స్ అమర్చింది. అనుమతులు లేకుండా జలసంధి మీదుగా ప్రయాణించే నౌకలను పేల్చడానికి వాటిని ఏర్పాటు చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య ఇటీవల సీజ్‌ఫైర్ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. అయితే హార్ముజ్ జలసంధి ఇంకా పూర్తిస్థాయిలో తెరుచుకోలేదు. హార్ముజ్ జలసంధిలో అమర్చిన సీమైన్స్ ఆచూకీని ఇరాన్ మర్చిపోయిందని, దీంతో ఈ మార్గాన్ని తిరిగి తెరవలేక పోయిందని అమెరికా అధికారులు తెలిపారు. జలసంధిలోకి మరిన్ని నౌకలను అనుమతించాలన్న ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ పాటించలేకపోవడానికి ఈ పరిణామం కూడా కారణమని సమాచారం.

## మీడియా రంగంలోకి మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి



**అక్షరటుడే, ఏపీ:** మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ మాజీ నాయకుడు విజయ సాయి రెడ్డి మీడియా రంగంలోకి రానున్నారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆయన తాజాగా డిజిటల్ మీడియాను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. విజయ సాయిరెడ్డి వైసీపీ హయాంలో ఎంతో కీలకంగా వ్యవహరించారు. పార్టీ ఓటమి తర్వాత ఆయన అనూహ్యంగా ఆ పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేశారు. అంతేగాకుండా రాజకీయాలకు సైతం దూరంగా ఉంటున్నారు. ఇటీవల ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాని ఆయన సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఈ క్రమంలో తాజాగా మీడియా రంగంలోకి వస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

## మహారాష్ట్రలో భూ ప్రకంపనలు



**అక్షరటుడే, మహారాష్ట్ర:** మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలోని హింగోలి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం ఉదయం 4.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. నాందేడ్, పర్భణి జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో కూడా ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. భూకంపంతో పంగ్రా షిండే గ్రామంలోని కొన్ని ఇళ్లు, కమ్యూనిటీ హాళ్లకు పగుళ్లు ఏర్పడ్డాయని హింగోలి కలెక్టర్ రాహుల్ గుప్తా తెలిపారు. ఉదయం 8:45 గంటలకు నమోదైన ఈ భూకంప తీవ్రతను 4.7గా జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ) లెక్కించిందని నాందేడ్ జిల్లా అధికారులు పేర్కొన్నారు. హింగోలి జిల్లాలోని వాస్మత్ తాలూకాలోని షిర్లీ గ్రామంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం కేంద్రీకృతమై ఉందని వెల్లడించారు.

## ఆ స్టార్ హీరోకి జోడీగా సాహో బ్యూటీ!

**బాలీవుడ్‌లో విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో విక్కీ కౌశల్. ప్రస్తుతం ఆయన అమర్ అశ్వత్థామ వంటి పౌరాణిక - చారిత్రక నేపథ్యం ఉన్న చిత్రాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే మహావతార్ అనే భారీ ప్రాజెక్టును పట్టాలెక్కించబోతున్నారు. ఈ సినిమాలో విక్కీ కౌశల్ సరసన నటించేందుకు శ్రద్ధా కపూర్‌తో చిత్ర బృందం సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ప్రచారంతో అభిమానుల్లో సరికొత్త కాంబినేషన్ పై ఆసక్తి నెలకొంది.**

—అక్షరటుడే, సినిమాడెస్క్

